క్లుప్తంగా

చురుగ్గా మున్సిపాలిటీ భవన నిర్మాణ పనులు



మున్సిపల్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ సుధీర్

కుప్పం: కుప్పం మున్సిపాలిటీ కార్యాలయ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. భవనానికి ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిందని డీఈ నాయక్ తెలిపారు. ఆయన గురువారం మున్సిపల్ చైర్మన్ సుధీర్, కమిషనర్ వరప్రసాద్‌తో కలిసి పనులను పరిశీలించారు. జనవరి లోపు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చైర్మన్ సుధీర్ తెలిపారు.

నేడు మండల సమావేశం

చౌడేపల్లె: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం 10:30 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సుధాకర్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు అభివృద్ధి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

గంగవరం: మండలంలోని కల్లుపల్లికి చెందిన విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి(82) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ కల్లుపల్లికి చేరుకుని భాస్కర్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద తదితరులు ఉన్నారు.

సచివాలయాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల విధులు

సదుం: సచివాలయాల్లో ఇకపై ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు నిర్వహించేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు ఎంపీడీవో నాగరాజు తెలిపారు. ఈ మేరకు గ్రామ సచివాలయంలో ఏర్పాట్లు చేయాలని సూచించారు.

త్రోబాల్ విజేత సోమల జట్టు



విజయం సాధించిన సోమల జట్టు

సోమల: మండలంలోని కందూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పుంగనూరు జోనల్ క్రీడా పోటీలు శుక్రవారం జరిగాయి. ఇందులో సీనియర్ బాలుర త్రోబాల్ విభాగంలో కందూరు, సోమల జెడ్పీ ఉన్నత పాఠశాల జట్లు తలపడ్డాయి. సోమల జట్టు విజయం సాధించింది. విజేతలను హెచ్ఎం నాగరాజు, పీడీ కరుణానిధి అభినందించారు.

ఎట్టకేలకు ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సెబ్ అధికారులు

పలమనేరు: కొన్నాళ్లుగా కర్ణాటకలోని మద్యం దుకాణాల నుంచి మద్యం తీసుకువచ్చి స్థానికంగా విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను సంబార్‌పూర్ వద్ద అరెస్టు చేసినట్టు సెబ్ సీఐ ఎల్లయ్య తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని మండీపేట కోటూరుకు చెందిన వాసు, ఈశ్వర్ కొన్నాళ్లుగా కర్ణాటక నుంచి మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్నారని తెలిపారు. వారిపై ప్రత్యేక నిఘా పెట్టి శుక్రవారం చాకచక్యంగా అరెస్టు చేశామన్నారు. వారి నుంచి బైక్, 172 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఎవరైనా కర్ణాటక మద్యాన్ని తెచ్చి ఇక్కడ విక్రయిస్తుంటే 8500876489కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆశా కార్యకర్తలే పల్లెకు పట్టుకొమ్మలు

యాదమరి: ఆశా కార్యకర్తలే పల్లెకు పట్టుకొమ్మలని మండల వైద్యాధికారి సురేఖ తెలిపారు. యాదమరి ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం తరఫున రెండు జతల యూనిఫాం వారికి అందజేశారు. అనంతరం సురేఖ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో అపరిశుభ్రంగా ఉంటే దోమలు వ్యాపించే అవకాశం ఉందన్నారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు ఎవరికైనా జ్వరాలు, అంటువ్యాధులు వ్యాపించాయా అని పరిశీలించాలని చెప్పారు. జ్వరాలు సోకి ఉంటే వెంటనే ఏఎన్ఎంలకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆస్పత్రికి సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించండి




వి.కోట: వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



రామకుప్పం: వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్సీ భరత్

వి.కోట: గతంలో ఏ ప్రభుత్వమూ చేయని అభివృద్ధిని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేశారని, ఆయనను మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ కోరారు. ఆయన శుక్రవారం ఎంపీపీ యువరాజ్ ఆధ్వర్యంలో బైరుపల్లి గ్రామ సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడంతోపాటు కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలలను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో పాఠశాలల్లో కనీసం తాగునీరు దొరికేది కాదన్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండేవని, సరైన భోజనం పెట్టేవారు కాదన్నారు. దళారీ వ్యవస్థకు స్వస్తి పలికి అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నట్టు చెప్పారు. మాదకుప్పం, బైరుపల్లి, తుపాకిచిన్నేపల్లి గ్రామాలకు సీసీ రోడ్లు వేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అంతకుముందు ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

అనారోగ్యంతో బాధపడుతున్న నాగరాజు, నవ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వచ్చిన చెక్కులు అందజేశారు. ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీ తమీమ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాలగురునాథ్, సింగిల్‌విండో చైర్మన్లు గోపిరెడ్డి, శ్రీరాములురెడ్డి, ఎంపీటీసీ మురుగేష్, సర్పంచ్ నీలమ్మ, నాయకులు సయ్యద్ షామీర్, కృష్ణమూర్తి, ఇంద్రేష్, పంచాయతీ కన్వీనర్ శంఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

రామకుప్పం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. ఆయన శుక్రవారం వీర్నమల పంచాయతీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఆర్థికంగా అభివృద్ధి సాధించారని పేర్కొన్నారు. రాజకీయ, సామాజిక రంగాల్లో సమాన అవకాశాలు కల్పించినట్టు వివరించారు. రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచినట్టు తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్న వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి సీఎంగా మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. అనంతరం వీర్నమలలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, కో-కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ మోహన్ నాయక్, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, నేతలు మున్ని, మునెమ్మ, బోర్‌వెల్ చెంగారెడ్డి, పడవాటు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

పెద్దపంజాణి: పేద ప్రజలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రావాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి తెలిపారు. అప్పినపల్లి సచివాలయం పరిధిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జీడీ బాబు, సింగిల్ విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి, సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ చంద్రారెడ్డి, నాయకులు రాజా రెడ్డి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు, నిత్యావసర సరుకుల పంపిణీ



రామకుప్పం: సాయిమాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి జన్మదిన వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని యానాదికాలనీలో ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు పలువురు నిరుపేదలకు 250 చీరలు, పంచెలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయి భక్తులు మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం జెడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. కుల గణనపై సమీక్షించారు. ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఈవోపీఆర్డీ శారదాదేవి పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులతో మంత్రులు పెద్దిరెడ్డి, నారాయణస్వామి, ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

గంగవరం: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి పెద్ద కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, జయలక్ష్మి వివాహం శుక్రవారం గంగవరంలో జరిగింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు క్రిష్ణమూర్తి, మురళీ, పలమనేరు టౌన్ కన్వీనర్ ఎస్‌కేఎస్ జాఫర్, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఆసుపత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, బైరెడ్డిపల్లి ఎంపీపీ రెడ్డెప్ప, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు జయకుమార్, మధు, శ్రీవాణి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తిరెడ్డి పాల్గొన్నారు.

మర్చెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శరవణ



శరవణను సన్మానిస్తున్న వ్యాపారులు

కుప్పం: కుప్పం మర్చెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏడీఎస్ శరవణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని పలువురు వ్యాపారులు మర్చెంట్స్ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. ఈ క్రమంలో సభ్యులు శుక్రవారం స్థానిక బైపాస్ రోడ్డులోని మురుగన్ మహల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏడీఎస్ సూపర్ మార్కెట్ అధినేత శరవణను ఎన్నుకున్నారు. తనను రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వ్యాపారుల సమస్యలపై చర్చించారు.



వనభోజనాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీపీఎస్ సభ్యులు

19న కార్తీక వనభోజనాలు

పలమనేరు: మండలంలోని కూర్మాయి కూర్మవరదరాజస్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 19న పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు నిర్వహించనున్నట్టు ఆ సమితి అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులు తెలిపారు. వారు శుక్రవారం వనభోజనాల పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోల సంఘం, సచివాలయ ఉద్యోగుల సంఘం, పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్, మాజీ సైనికోద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు సంఘాలు భాగస్వామ్యంగా ఉంటాయన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



పనులను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన శుక్రవారం పత్రపల్లిలో జెడ్పీ నిధులతో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పిఎస్ నాగరాజు, ఎంపీటీసీ చలపతి, నరేంద్ర పాల్గొన్నారు.

దొంగబాబాలతో జాగ్రత్త



సైన్స్‌పై అవగాహన కల్పిస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

వి.కోట: మన చుట్టూ జరిగే ప్రతి పని వెనుకా సైన్స్ ఉంటుందని, దొంగబాబాలు, మంత్రగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యుగంధర్ బాబు తెలిపారు. ఆయన శుక్రవారం నేషనల్ సైంటిఫిక్ టెంపర్ కాంపెయిన్‌లో భాగంగా ముదరందొడ్డి, తోటకనుమ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మూఢ నమ్మకాలు, అపోహలపై అవగాహన కల్పిస్తూ సైన్స్ మ్యాజిక్ వండర్ షో నిర్వహించారు. దొంగబాబాలు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని వివరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి, ముదరందొడ్డి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం చైతన్య, తోటకనుమ ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నకీవుల్లాఖాన్, నాగభూషణం, వెంకటపతి

పుంగనూరు: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని గ్రంథాలయాధికారి తులసీనాథ్ తెలిపారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో విశ్రాంత తెలుగు పండితులు రామలింగప్ప, సూర్యనారాయణ, నాగభూషణం, ఉర్దూ పండితులు డాక్టర్ నకీవుల్లాఖాన్, హసీనాబేగం పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. విశ్రాంత ఉద్యోగులు గంగులమ్మ, వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల నిర్వహణకు పలువురి విరాళం



రూ.లక్ష చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ దామోదరరాజు

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 24 నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పలువురు విరాళం ఇచ్చినట్టు రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడు టి.రామచంద్ర తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జెడ్పీటీసీ దామోదరరాజు రూ.లక్ష, శెట్టిపేట ఉప సర్పంచ్ యశ్వంత్ రాజు రూ.75 వేలు, మేకల మోహన్‌రెడ్డి, జి.శ్రీనివాసులురెడ్డి, హనుంమతురెడ్డి రూ.1.50 లక్షలు, ఎంపీపీ రామమూర్తి, సిమెంట్‌షాప్ హరి, డాక్టర్ కుమార్, టీచర్ హరి బాబు రూ.20 వేల చొప్పున, ఎంఈవో తిరుమలమ్మ రూ.10 వేలు విరాళం ఇచ్చినట్టు వివరించారు. క్రీడాకారుల బస కోసం బైసాని కల్యాణ మండపాన్ని కేటాయించినట్టు తెలిపారు. క్రీడల విజయం కోసం పలువురు పూర్వ విద్యార్థులు కృషి చేస్తున్నారని తెలిపారు.

ఓటును బాధ్యతగా గుర్తించాలి



ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న

గంగవరం: పౌరులకు ఓటు హక్కు చాలా విలువైందని, 18 ఏళ్లు నిండిన వారు ఓటు పొందడాన్ని బాధ్యతగా గుర్తించాలని డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న తెలిపారు. మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఓటు హక్కు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని తమకు ఇష్టమైన నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. గరుడ యాప్ ద్వారా ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టామని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతరెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ గీతాంజలి పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా రాధాకృష్ణ

రామకుప్పం: ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా రాధాకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో శివశంకర్ సెలవుపై వెళ్లారు. దీంతో ఈవోఆర్డీ రాధాకృష్ణను ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి ధ్యాన మహాయజ్ఞం

తవణంపల్లె: మండలంలోని శ్రీ విష్ణ్వేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ధ్యాన మహాయజ్ఞం కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్లోబల్ స్పిరిచువల్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు ప్లేడియన్ టీచింగ్స్, మెడిటేషన్, చక్ర మెడిటేషన్, లైట్ మెడిటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ధ్యానులు పాల్గొని ధ్యాన మహాయజ్ఞం విజయవంతం చేయాలని కోరారు.

వాహనాల వేలం వాయిదా

రామకుప్పం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించాల్సిన వాహనాల వేలంపాటను కొన్ని కారణాల వల్ల సోమవారానికి వాయిదా వేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను వేలం వేయనున్నట్లు తెలిపారు.

కుల గణనపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి

రామకుప్పం: కుల గణనపై సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు అవగాహన కల్పించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కుల గణనపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చేపడుతున్న కుల గణన గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించి అవసరమైన వివరాలు సేకరించాలన్నారు. దీనిపై సచివాలయ సిబ్బంది, వలంటీర్ల యాప్ ద్వారా కుల గణన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి కుల గణన ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాధాకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ దిలీప్, ఏపీవో రవికుమార్ పాల్గొన్నారు.

మా బడి వద్ద చెత్త వేయొద్దు



చెత్త వేయవద్దని ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

- టీచర్స్ కాలనీలో విద్యార్థుల ర్యాలీ

చౌడేపల్లె: అమ్మలారా.. అన్నలారా.. మా బడి ఎదుట చెత్త వేయకండి అని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విన్నవించారు. వారు శుక్రవారం టీచర్స్ కాలనీలో ర్యాలీ చేశారు. ఎమ్మార్సీ ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రం ఉన్నాయి. వీటిలో సుమారు 165 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలను ఇటీవల ప్రభుత్వం నాడు-నేడు కింద అత్యంత సుందరంగా ఆధునీకరించారు. టీచర్స్ కాలనీ వాసులు తమ ఇళ్లలోని చెత్తను పాఠశాల గేటు ముందు ఉన్న ఖాళీ ప్రదేశంలో పడేస్తున్నారు. వర్షానికి చెత్త కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. పలుమార్లు చెప్పినా చుట్టుపక్కల వారు పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు జగన్‌మోహన్ రెడ్డి, రమణయ్య పిల్లలతో కలిసి వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఇకనైనా పాఠశాల చుట్టుపక్కల చెత్త వేయవద్దని కోరారు.

కవిత్వంతో సృజనాత్మకతకు మరింత పదును

చిత్తూరు కార్పొరేషన్: కవితలతో సృజనకు పదును పెట్టవచ్చని రచయిత్రి డాక్టర్ రామలక్ష్మమ్మ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆమె ప్రసంగించారు. చిన్నతనంలో గ్రంథాలయాలకు వెళ్లడం ద్వారా సాహిత్యంపై ఆసక్తి పెరిగిందని చెప్పారు. తద్వారా రచనలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. పుస్తకాల ఆవశ్యకతను కవి హరికృష్ణారెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి లలిత, రచయితలు అరుణ, విజయ్‌కుమార్, మిట్టలక్ష్మి, పూర్ణిమ, కృష్ణవేణి, సహదేనాయుడు, భాస్కర్‌రెడ్డి, శీలా, రమేష్, పద్మజ, సునీత తదితరులు పాల్గొన్నారు.